## ఉచిత ఆన్‌లైన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 13 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి ఇంటర్‌నెట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలకు వీలుగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఉచితంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ యోగేశ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధి ప్రజలకు అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేశామని, దరఖాస్తు ఫారాలను నేరుగా పురపాలక సంఘం కార్యాలయంలో అందజేయడానికి ఒక డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు స్కీంకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు సోమవారం చివరి తేదీ అని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 13 : చేవెళ్ల మున్సిపాల్ కేంద్రంలోని టీచర్ కాలనీలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ థెరపీ, సుజోక్ థెరపీ ఉచిత వైద్య శిబిరాన్ని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం నేటి నుంచి 17వ తేదీ వరకు, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, వైద్యులు, బ్రహ్మకుమారి సభ్యులు ఉన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పర్వతాలు, నాయకులు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 13: ఈ నెల 21, 22న శంషాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా కార్యదర్శి శ్రీను, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి పని భద్రత లేకుండా పోయిందన్నారు. పని చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగినా, చనిపోయినా పట్టించుకునే నాధుడే లేడన్నారు. కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా నిర్మాణ రంగంలో పని చేయిస్తున్న కార్పొరేట్ నిర్మాణ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం, గోవింద్, జంగయ్య, రమేష్, రాజు, శంకర్, పవన్, ఆకాష్ పాల్గొన్నారు.

## గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి



కడ్తాల్, ఏప్రిల్ 13: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం ఆగదని మండల సాధన సమితి నాయకులు అన్నారు. తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ... జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం చేపట్టిన దీక్షలో అశోక్‌గౌడ్, సాయిరాం, భాస్కరాచారి, అనిల్, కృష్ణాజీ, బాలయ్య, మల్లయ్య, మాణిక్యరెడ్డి తదితరులు కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని, లేకుంటే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల వేడుక



పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 13: మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ కాలనీలో క్రైస్తవులు ఆదివారం మట్టల వేడుక ఘనంగా జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు ఈత మట్టలను రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి చర్చి నుంచి కాలనీ వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఏసు జెరూసలేంలోకి ప్రవేశించిన రోజున మట్టలను అలంకరించి స్వాగతం పలుకుతారని పాస్టర్ సిల్వధర్ తెలిపారు. కార్యక్రమంలో సామేల్, ఎలీషా రాజు, డొమినిక్, మల్కన్న, సీహెచ్ రమేశ్, మల్లయ్య, దినకర్, నాగరాజు, దేవదాసు, జాకోబ్, రమేశ్, అమృత, ఫ్రూటీ, శోభ, లీల తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లోని చాకలిగూడ-వెంకటాపూర్ గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రోడ్డు



మొయినాబాద్‌లోని శ్రీరాంనగర్-వెంకటాపూర్ గ్రామాల మధ్య రోడ్డు

# దారులు దారుణంగా..

**అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు**
**గుంతల రోడ్లతో తరచూ ప్రమాదాలు**
**పట్టించుకోని ప్రజాప్రతినిధులు**
**మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్న ప్రజలు**



మొయినాబాద్‌లోని తోలుకట్టా గ్రామంలో రోడ్డు దుస్థితి



మొయినాబాద్‌లోని కంచెమోనిగూడ-చాకలిగూడ గ్రామాల మధ్య రోడ్డులో కంకర తేలిన దృశ్యం

మొయినాబాద్, ఏప్రిల్ 13 : ప్రజాపాలనలో గ్రామీణ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఆ రోడ్ల మీద ప్రయాణం చేయాలంటే ప్రజలకు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజలు తమ రాకపోకలు సాగించడానికి ప్రత్యామ్నాయమైన రోడ్లు లేకపోవడంతో గుంతలమయంగా మారిన రోడ్ల వెంబడి ప్రయాణం చేయక తప్పడం లేదు. బీటీ రోడ్లు గుంతలమయంగా మారడంతో పాటు బీటీ రోడ్లు కాదు మట్టి రోడ్ల మాదిరిగా కనిపిస్తున్నాయి. ఇలాంటి దుస్థితి చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మున్సిపాలిటీ, మొయినాబాద్ మండలంలోని గ్రామీణ రోడ్లు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని చందానరగ్ గేట్ వరకు రోడ్డు పూర్తిగా దయనీయ పరిస్థితిలో దర్శనం ఇస్తుంది. రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం గ్రామం వరకు ఉన్న రోడ్డు, మోత్కుపల్లి రోడ్డు సైతం దారుణంగా మారాయి. సురంగల్ నుంచి వయా శ్రీరాంనగర్ వెంకటాపూర్ గ్రామం వరకు గత పంచాయతీ రాజ్ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రస్తుతం బీటీ రోడ్డు కాదు మట్టి రోడ్డును తలపిస్తుంది. ఏ మాత్రం వర్షం పడిన రోడ్డు కరిగట్లను తలపిస్తుంది. సుమారుగా 8 కిలో మీటర్ల వరకు రోడ్డు గుంతలుగా మారడంతో పూర్తిగా బీటీ, కంకర తేలి మట్టి రోడ్డుగా కనిపిస్తుంది. ఈ రోడ్డు మీద వెళ్లే ప్రజలు సుమారుగా 8 కిలో మీటర్ల వరకు ప్రయాణం చేయాలి అంటే నరకం అనుభవిస్తున్నారు. అదే విధంగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నుంచి వయా కనకమామిడి, కంచమోనిగూడ గ్రామాల మీదుగా ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు పూర్తిగా గుంతలుగా ఏర్పడి ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. ఇలా మొయినాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని దారులు దారుణంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లతో ఇప్పటికే చాలా వరకు ప్రమాదాలు జరిగాయి. ఇలాంటి దుస్థితి ఉంటే ప్రజాప్రతినిధులు ఎవరు కూడా ప్రజల బాధలను పట్టించుకునే నాథుడే లేరు. ప్రజాపాలనలో ఏ ప్రజాప్రతినిధికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజలు పడుతున్న బాధలను అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకుని వర్షాకాలం రాక ముందే రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్టిఫికెట్ల అందజేత



ఆరుట్లలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

మంచాల, ఏప్రిల్ 13: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సేవా భారతి ఆధ్వర్యంలో దక్కన్ బ్లడ్‌సెంటర్, లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేశ్, శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జనార్దన్‌రెడ్డి, కృష్ణ, శ్రీకాంత్, వెంకటేశ్, రాము, రమేశ్, గోపాల్, రమేష్, శ్రీశైలం, నాగేశ్, విజయేందర్, హరీశ్, రాజవర్ధన్, అజయ్, గోపాల్, జగన్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కాలనీ అసోసియేషన్ సభ్యులు

తుర్కయాంజాల్, ఏప్రిల్ 13 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్ టెలిఫోన్ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం కాలనీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సౌజన్య భారతీ, గౌరవ అధ్యక్షులుగా చంద్రశేఖర్, గాంధీ, జనరల్ సెక్రెటరీ చంద్ర శేఖర్‌రెడ్డి, కోశాధికారి వేంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా నాగార్జున చౌదరి, రవిచంద్ర, మదనాచారి, నరేందర్, శివ, జాయింట్ సెక్రెటరీగా సునీతారెడ్డి, మాధవ, పాండు రంగారెడ్డి, రంజిత్, రామకృష్ణ, రాహుల్, సలహాదారుడు గాంధీ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా డీసీసీ జనరల్ సెక్రెటరీ హర్షలత తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరులను సంరక్షించాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

నందిగామ, ఏప్రిల్ 13 : భావితరాల భవిష్యత్ కోసం నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని సాయిరెడ్డి చెరువును అమెజాన్ సెట్రీస్ సంస్థ సుందరీకరణ చేసే పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం కొత్తూరు మున్సిపాల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెజాన్ సెట్రీస్ సంస్థ చెరువు మరమ్మతు చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని సంస్థ వారిని అభినందించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరుల సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అమెజాన్ సెట్రీస్ సంస్థ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు పనుల పరిశీలన**

కొత్తూరు మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, నాణ్యతతో చేపట్టాలని ఆయన సూచించారు.

## మేకగూడలో బోరు ఏర్పాటు



బోరు వేయిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు రాజు

నందిగామ, ఏప్రిల్13: మేకగూడ గ్రామంలోని న్యాకర్ల కుంట స్మశాన వాటికలో నీటి సమస్య ఉండటంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత మేకం రాజుముదిరాజ్ సొంత ఖర్చులతో బోరు బావిని తవ్వించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రాజునాయక్, మాజీ వార్డు మెంబర్ రాజుముదిరాజ్, యాదయ్య, శ్రీశైలం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## కొర్ర తండాలో నీటి తంటాలు



నీరు రాక ఖాళీ బిందెలతో ఎదురుచూస్తున్న కొర్రతండా వాసులు

మాడ్గుల, ఏప్రిల్ 13 : మండలంలోని కొర్రతండా గ్రామ పంచాయతీలో తండా వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమస్యల పరిష్కారంలో విఫలం చెందారని గ్రామస్తులు ఆరోపించారు. తండావాసులకు వివిధ అవసరాలకు వాడుకోవడానికి నీళ్లు లేకపోవడం చాలా బాధాకరమని, గ్రామ పంచాయతీ బోరు పాడవడంతో తండావాసులు ఖాళీ బిందెలతో నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందించి మాకు నీటి కష్టాలు లేకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు.



మంచాల: జాపాల పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



మొయినాబాద్: పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

# ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



చేవెళ్లరూరల్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచాల, ఏప్రిల్13: మంచాల మండల పరిధిలోని జాపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న 2009-2010 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరూ ఆదివారం మంచాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మొయినాబాద్ :** హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటి పరిధిలోని సరస్వతి విద్యాపీఠం-విద్యారణ్య ఆవాస మహా విద్యాలయం శ్రీ శారదాధామం పాఠశాలకు చెందిన 1995-1996 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హిమాయత్‌నగర్ రెవెన్యూలో గండిపేట చౌరస్తాలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు విద్యా బోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు.

**ఆలూర్‌లో..**

చేవెళ్ల రూరల్ : 2007-08 సంవత్సరంలో చేవెళ్ల మండల పరిధి ఆలూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆలూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా బోధన చేసిన గురువులను ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, దశరత్, కృష్ణగౌడ్, ఇంతియాజ్, సాదత్ అలీ కిష్టయ్య, సయ్యద్ సలీం, నర్సింహులు, మల్లేష్, రామచందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్నం అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



యాచారం, ఏప్రిల్13: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో రూ.75లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. మల్కీజ్‌గూడాలో రూ.15లక్షలతో సీసీ రోడ్డు, రూ.10లక్షలతో యూత్ బిల్డింగ్, రూ.30లక్షలతో సీసీ రోడ్డు, ధర్మన్నగూడలో రూ.10లక్షలతో భూగర్భ డ్రైనేజీ, రూ.10లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ధర్మన్నగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం జిల్లా నాయకుడు అంజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులు వేంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, నర్సింహ, సుధాకర్, శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కడ్తాల్, ఏప్రిల్ 13: తమతో పదో తరగతి వరకు కలిసి చదువుకొని అనారోగ్యంతో మరణించిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు తోటి మిత్రులు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల రాజు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. చనిపోయిన మిత్రుడి కుటుంబాన్ని ఆదివారం చిన్ననాటి స్నేహితులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు రూ.12వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మిత్రుడి కూతురిని చదివించడంతోపాటు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని వారు భరోసానిచ్చారు. కార్యక్రమంలో గణేశ్, రాజు, శ్రీశైలం, వెంకటేశ్‌యాదవ్, శ్రీకాంత్, శ్రీరాములు, శివ, ఆంజనేయులు, కిరణ్, సురేశ్ పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

షాబాద్, ఏప్రిల్ 13 : గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫరుక్‌నగర్ మండలం చెవులపల్లి గ్రామానికి చెందిన బోడ మాధవి ఆదివారం ఉదయం 11 గంటలకు షాబాద్ మండలంలోని ఆస్పల్లిగూడ గ్రామ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న తన కుమార్తెను చూసేందుకు బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నీటి బకెట్‌లో పడి బాలుడి మృతి



ఆద్యుత్(ఫైల్)

నందిగామ, ఏప్రిల్13: ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడి 15 నెలల బాలుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకట్‌చారి కుమారుడు ఆద్యుత్(1) ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లి నిండుగా ఉన్న నీటి బకెట్‌లో పడి పోయాడు. తండ్రి వెంకట్‌చారి వచ్చి చూసే సరికి తలకిందులుగా బకెట్ పడి ఉండటంతో వెంటనే కన్హా మెడికల్ సెంటర్‌కు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి హత్య

**గొంతు కోసి, కత్తులతో పొడిచి..**
**కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు**

షాద్‌నగర్, ఏప్రిల్13: ఓ గుర్తు తెలియని వ్యక్తిని అతిదారుణంగా హత్య చేసిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ పంచాయతీ పరిధిలోని ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు అతి దారుణంగా హత్య చేశారని షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. 44వ జాతీయ రహదారి పక్కన ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుర్తు తెలియని వ్యక్తి గొంతు కోసి, కడుపులో కత్తులతో పొడిచి దారుణ హత్యకు పాల్పడ్డారని వివరించారు. మృతుడి చేతిపై జై బాలయ్య అనే పచ్చ బొట్టు ఉందని, మెడలో వేంకటేశ్వర స్వామి లాకెట్, నలుపు రంగు కార్గో పాయింట్, ముదురు నీలం రంగు చొక్కాను ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

## అంబేద్కర్ జయంతి ర్యాలీని విజయవంతం చేయండి

ఆమనగల్లు, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.